యువత సన్మార్గంలో నడవాలి

ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి

విశాలాంధ్ర - సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లా దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీస్ మెగా వాలీబాల్ టోర్నమెంట్ ఈనెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరిగింది. ఈ క్రీడల్లో గెలుపొందిన యువ క్రీడాకారులకు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన్యంలో యువత బాగా చదువుకొని, క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి సన్మార్గంలో నడిచి తమ కుటుంబాలకి, దేశానికి అండగా ఉండాలని తెలిపారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్ లో 44 జట్లు పాల్గొనగా మొదట బహుమతి దుగ్గి రూ.5వేలు, రెండవ బహుమతి పొల్ల రూ.3వేలు, మూడో బహుమతి పెద్దపల్లంకి గెలుపొందారు. ఈ కార్య క్రమంలో సీఐ చంద్రమౌళి, ఎస్సైలు షేక్ మస్తాన్, అమ్మనరావు, అనీల్ కుమార్, ధోనిభాయి సర్పంచ్ వెంకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్ఐ శర్మకు ఉత్తమ సేవా అవార్డు

విశాలాంధ్ర - కురుపాం: మన్యం జిల్లా పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు ఏపీ పోలీస్ డిజిపి బ్రాంజ్ మెడల్‌ను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి రిటైర్డ్ ఏఎస్ఐ వివిఎస్ఆర్ శర్మకు బహుకరించారు. హెడ్ కానిస్టేబుల్‌గా ఉత్తమ సేవలు అందించిన ఆయన ఏఎస్ఐగా పదోన్నతి పొంది అత్యధిక కాలం కురుపాం స్పెషల్ బ్రాంచ్‌లో పని చేశారు. సేవలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ అందరి మన్ననలు పొందారు. రాష్ట్ర పోలీసు శాఖ ఆయన సేవలు గుర్తించి డిజిపి ఉత్తమ సేవా బ్రాంజ్ పథకం అందజేశారు.

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: సీహెచ్ఓల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ముఖ్యంగా పని ఆధారిత ప్రోత్సాహ కాలను క్రమబద్ధం చేసి, ఈపిఎఫ్ఓ పునరుద్ధరిం చాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి సంఘ అధ్యక్షులు ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పెదబొండపల్లి పీహెచ్‌సీలో సీహెచ్ఓలుగా విధులు నిర్వహి స్తున్న వారు నిరసన వ్యక్తం చేశారు. వారి న్యాయమైన డిమాం డ్లను ప్లేకార్డుల రూపంలో ప్రదర్శిస్తూ ప్రభుత్వంపై మండి పడ్డారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సిహెచ్ఓలుగా విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ఈపిఎఫ్ఓలను పునరు ద్ధరించాలని క్లినిక్ అద్దె బకాయిలు తక్షణమే మంజూరు చేయాలన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

విశాలాంధ్ర - బెలగాం: విజయ నగరం జిల్లా ఎస్.కోట మండలం బొడ్డవార పంచాయతీ బొడ్డపాడు గ్రామంలో గిరిజనులు సాగు చేస్తున్న భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం విజయనగరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కండపల్లి భీముడు, పురం అప్పారావు కోరారు. ఈమేరకు గురువారం పార్వతీ పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ఏపీఓ మురళీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సం. నుండి 20 మంది గిరిజన కుటుంబాల వారి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారు పాసు పుస్తకాలు నేటి వరకూ ఇవ్వ లేదని గతంలో అనేకసార్లు అధికారులకు దరఖాస్తులు చేసి యున్నారని సుమారు 39 ఎకరాలను సాగు చేసుకుని ఫలసాయం పొందుతున్నారని తెలిపారు. రైతు భరోసా కూడా పొందుతున్నారని దయచేసి వారికి పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, బొడ్డపాడు గ్రామానికి చెందిన అంటిపర్తి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు

విశాలాంధ్ర - బలిజిపేట: బలిజిపేట పేట మండలం వెంగళరాయ పురం గ్రామంలో వ్యవసాయ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ శాఖల గ్రామస్థాయి సమన్వయ సమావేశం జరిగింది. మూడడ్ల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు వలన రైతుకి, భూమికి, పర్యావరణానికి, ప్రధాన పంట వినియోగదారునికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రకాల విత్తనాలను వేయడం వలన ఎకరాకు సుమారు ఎనిమిది మెట్రిక్ టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభించడంతో జీవ వైవిధ్యముతో పాటు భూమిలో సేంద్రీయ కర్బన శాతము పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, లక్ష్మి తిరుపతిరావు, గ్రామ సర్పంచ్, పెద్దలు రైతులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రేషన్ పంపిణీ

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మం డలంలోని టీకే జమ్ము పంచాయతీలో ఎట్టకేలకు రేషన్ పంపిణీ ప్రారం భమైంది. గురువారం కాంట్రాక్ట్ సేల్స్ మ్యాన్ జీలకర్ర గోపాలరావు ఎండియు వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేశారు. డిఆర్ రేషన్ డిపో నెంబర్ 40 27 పరిధిలోని గోర్లి గొర్లివలస టీకే జమ్ము కూటాం పాండురసింగి జమ్మవలస కోడిపల్లిగూడ చిన్నదోడిజ పెద్దదోడిజ గ్రామాలలో మొత్తం 563 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి పూర్తిస్థాయిలో నిత్యవసర సరుకులు అందుతున్నాయి. కాగా ఏప్రిల్ నెలకు సంబంధించి ఈకెవైసీ ఆలస్యం కావడంతో రేషన్ పంపిణీ జరగని పరిస్థితి. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురు వారం రేషన్ పంపిణీ ప్రారంభమైంది. మరో రెండు రోజుల్లో ఈ పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని సేల్స్ మేన్ జీలకర్ర గోపాలరావు తెలిపారు. ఇదిలా ఉండగా వచ్చే నెల నుంచి ఒకటవ తేదీ నుండే రేషన్ పంపిణీ యధావిధిగా చేస్తామని ఆయన అన్నారు.

చెముడుగూడ పంచాయతీలో గ్రామ సభ

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలో చెముడు గూడ పంచాయతీలో గ్రామసభ గ్రామ సర్పంచ్ నిమ్మల చంద్రకళ, నిమ్మల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ మండంగి సుష్మ, పంచాయితీ సెక్రటరీ మండంగి అశోక్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. 2025-2026 సంవత్సరం బడ్జెట్ ఆమోదంపై చర్చించిన తర్వాత ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన నవధాన్యాలు పిఎండిఎస్ విత్తనాలపై గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌చార్జి కమిడి భూషణ్ రావ్ అవగాహన కల్పించారు. ఒక ఎకరాకు 18 నుండి 30 రకాలు విత్తనాలు అలాగే ఒక ఎకరాకు 12 కేజీల నుండి 25 కేజీలు విత్తనాలు అవసరంపై వివరించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు పిసా చట్టం ప్రెసిడెంట్, సెక్రటరీ హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు, సిహెచ్ డబ్ల్యూ అగ్రికల్చర్ అసిస్టెంట్ చైతన్య, ఐసిఆర్పిఎస్ పద్మ సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్యలు ఆదాయం పెంచాలి

విశాలాంధ్ర - పాచిపెంట: గ్రామ, మండల సమాఖ్య ఆదాయం పెంచాలని వెలుగు ఏపీడి వై. సత్యం నాయుడు సూచించారు. గురువారం పాచిపెంట వెలుగు కార్యాలయంలో సీసీలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు సభ్యులు స్వంత నిధులు సిఐఎఫ్ విఓఆర్ఎఫ్ నిధులు అప్పులు ఇచ్చి మండల సమాఖ్య ఆదాయం పెంచాలని కోరారు. సభ్యులు తీసుకొన్న అప్పులు తప్పనిసరిగా జీవనోపాధి కోసం మాత్రమే వినియోగించే విధంగా అవగాహన కల్పించాలని కోరారు, మండలంలో వీడీవీకే సభ్యులకు శిక్షణలు ఇచ్చి యాక్టివిటీ జరిగే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర - మక్కువ: మండలంలోని మూడు రోడ్ల జంక్షన్లో పోలీసులు గురువారం వాహనాలను తనిఖీలు నిర్వహించారు. స్థానిక ట్రైనింగ్ ఎస్సైలు ఎస్.నాగరాజు, పి.గోపి వాహనాలను క్షుణంగా తనిఖీ చేశారు. అదేవిధంగా వాహనదారులతో మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. పత్రాలు సరిగా లేనివారికి చలానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిఎం మొండి వైఖరి విడనాడాలి

ఎస్.డబ్ల్యూ.ఎఫ్ రౌండ్ టేబుల్‌లో వక్తల డిమాండ్

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ తీరు మారాలని, కార్మికుల పట్ల కక్షపూరితమైన చర్యలు విడనాడాలని సీఐటీయూ, వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో ఎ.ఎస్.టి. బాబుపై అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ పార్వతీపురం ఎస్.డబ్ల్యూ.ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో సిహెచ్ వెంకట్రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి. రమణారావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, డివైఎఫ్ఐ నాయ కులు పి.రాజశేఖర్, ఎస్.డబ్ల్యూ. ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఎస్.వి.పి. రావు, విజయనగరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకట్రావు, చంద్రయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో మేనేజర్ కార్మికులను 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్, ట్రాన్స్‌ఫర్లు చేస్తున్నారని ఇది చాలా అక్రమమైన చర్యని అన్నారు. ఎ.ఎస్.టి బాబు గతం నుండి డిపోలో జరుగుతున్న అనేక అక్రమ పనులకు అడ్డుపడుతూ, ప్రతి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను వ్యతిరేకిస్తుండడంతో ఓడి కండక్టర్ జెఎం రావుతో తప్పుడు ఫిర్యాదు రాయించుకొని దాని ఆధారంగా, ఎ.ఎస్.టి బాబును సస్పెండ్ చేయడం అన్యాయమని మండిపడ్డారు. కార్మికులు విధి నిర్వహణలో తప్పుడు కార్యక్రమాలు చేపడితే క్రమ పద్ధతిలో చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పార్వతీపురం డిపోలో గతం వరకు 12 మంది కండక్టర్లను, డ్రైవర్లను డిపో యాజమన్యం సస్పెండ్ చేయడం చాలా అన్యాయమని భవిష్యత్ పోరాటాలలో తమ పూర్తిస్థాయి మద్దతు ఉంటుందన్నారు.

శంబర వైద్యాధికారికి స్వల్ప గాయాలు

విశాలాంధ్ర - మక్కువ: మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పని చేస్తున్న ఎం.సాహితికి వాహనం అదుపుతప్పి స్వల్ప గాయాలు అయ్యాయి. ఎర్ర సామంత వలస గ్రామంలో వైద్య సేవలు అందించి తిరుగు ప్రయాణంలో శంబర పీహెచ్‌సీకి వస్తుండగా మార్కండు పుట్టి తెలగడ వలస మధ్యలో స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపు తప్పి పడిపోయారు. వెంటనే అక్కడి నుంచి ఆటోలో మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వచ్చి వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వాణిజ్య సముదాయ భవనాన్ని నిరుద్యోగులకు కేటాయించాలి

పంచాయతీ నిరుద్యోగుల విజ్ఞప్తి

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి జిల్లా అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ పరిధిలో పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదురుగా అరకు- పాడేరు ప్రధాన రహదారిని ఆనుకొని పెదలబుడు పంచాయతీ నిర్మాణం చేపట్టిన వాణిజ్య భవన సముదాయంలో ఉన్న 9 షాపులను గిరిజన నిరుద్యోగులకు కేటాయించాలని పంచాయతీ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పంచాయితీకి గణనీయంగా ఆదాయం సమకూరా లన్న సంకల్పంతో పెదలబుడు మేజర్ పంచాయతీ నిర్వాహకులు పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట పశుసంవర్ధక శాఖకు చెందిన స్థలంలోనే 9 దుకాణాలు నిర్మించారు. మెయిన్ రోడ్‌లోనే ఉండడంతో ఈ దుకాణాలు గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు కేటాయిస్తే పంచాయితీకి గణనీయమైన ఆదాయంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కూడా లభిస్తుందని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఇప్పటికే వాణిజ్య భవన నిర్మాణ సముదాయం పూర్తి కావడంతో నిరుద్యోగుల నుండి దరఖాస్తులు ఆహ్వానించి లాటరీ పద్ధతిలో నిరుద్యోగులకు దుకాణాలు కేటాయించాలని, షాపుల కేటాయింపుల్లో కూడా పంచాయతీ నిర్వాహకులు, జిల్లా పంచాయతీ అధికారులు పారదర్శకంగా వ్యవహరించి షాపుల కేటాయింపు జలపాలని నిరుద్యోగులు కోరుతున్నారు. 9 షాపులే ఉండడంతో ఎక్కువ మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని దరఖాస్తుదారుల అర్హతను సమగ్రంగా పరిశీలించి జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్ నేతృత్వంలో నిరుద్యోగులకు దుకాణాలు కేటాయించాలని ప్రజాసంఘాల నేతలు, స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు, పౌర హక్కుల సంఘాల నాయకులు, నిరుద్యోగ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. దరఖాస్తులు ఆహ్వానించకుండా ఇష్టారాజ్యంగా షాపులు కేటాయిస్తే అనేక అక్రమాలు జరిగే అవకాశం ఉందని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. దరఖాస్తులు ఆహ్వానించక పోతే బంధుప్రీతి, ధన దాహం, రాజకీయ ప్రలోభాలు ఎక్కువై వారికి చెందిన యువకులకే షాపులు కేటాయించే అవకాశం ఉందని దీనివలన నిరుపేద గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు నష్టపోక తప్పదని వారంతా అంటున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పెదలబుడు మేజర్ పంచాయతీ వాణిజ్య సముదాయం కేటాయింపు కోసం అధికారులతో ఓ కమిటీని నియమించి ఆ కమిటీ ద్వారానే దరఖాస్తులను ఆహ్వానించి ఆ కమిటీ ఆధ్వర్యంలోనే అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు దుకాణాలు కేటాయించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో గిరిజన నిరుపేద యువతి యువకులకు అన్యాయం జరుగుతుందని అలా జరిగితే ఊరుకోబమని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపడతామని నిరుపేద నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు.

రెవెన్యూ సమస్యలకి పూర్తిస్థాయి పరిష్కారం

కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: జిల్లాలో ల్యాండ్ రెవెన్యూ సమస్యలన్నీ ప్రణాళికాయుతంగా పూర్తి స్థాయిలో పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ సమస్యలపై నిర్వహించిన వర్క్ షాప్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో అందిన ఫిర్యాదుల పరిష్కారం పూర్తి కాలేదని, ఇంకా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ పెండింగ్ సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించినందున ఇప్పటికే ఉన్న సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని, అవి కాకుండా రెవెన్యూ అధికారులు గుర్తించిన సమస్యలను కేటగిరీల వారిగా విభజించి సత్వర పరిష్కారం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా అలినేషన్ అఫ్ ల్యాండ్, మ్యుటేషన్, ఆర్ఓఆర్, ఇనాం ల్యాండ్స్ భూ స్థిరీకరణ, రీ సర్వే తదితర సమస్యలను, ఆన్‌లైన్, ఆఫ్ లైన్ తేడాలను, క్లరికల్ తప్పులను సరిదిద్దాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డా. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై వైసీపీ చిన్నచూపు

విశాలాంధ్ర - కొయ్యూరు: నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం చిన్న చూపు చూసి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేయడమే కాకుండా ఉద్యోగ పదవి విరమణ వయస్సు పెంచి ఉద్యోగ ఖాళీలు భర్తీ కాకుండా చేయడంతో ఒక తరం నిరుద్యోగులను వీధిన పడేసేలా చేసిందని టీడీపీ మండల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జంపా వెంకటరమణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఉద్యోగ నియామకాలు చేపడుతున్న ప్పటికీ ఉద్యోగ అర్హత వయసు రీత్యా దరఖాస్తులు చేయలేని దుస్థితి నిరుద్యోగులకు దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులపై మానవతా దృక్పథంతో ఆలోచన చేసి ఉద్యోగ అర్హత వయసు సడలింపు ఇవ్వాలని కోరారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని అర్హులైన ఎస్సీ అభ్యర్థులు రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 21 నుంచి 50 వయస్సు కలిగి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14 నుంచి మే 10 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

రేషన్ డిపో మంజూరు చేయాలి

రాష్ట్ర జీసీసీ చైర్మన్‌ను కలిసిన కె.బోడ్డాపుట్టు గ్రామస్తులు

విశాలాంధ్ర- పెదబయలు: మండలంలో కుంతుర్ల పంచాయతీకి చెందిన నాలుగు మారుమూల గ్రామాలు కే.బోడ్డాపుట్టు, కిండలం, కందులగుంట, జాలరిగుమ్మి పాతపాడు గ్రామస్తులు తమకు రేషన్ డిపో మంజూరు చేయాలని కోరుతూ పాడేరులో రాష్ట్ర జిసిసి చైర్మన్ క్యాంపు కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతి అందజేశారు. అంతే కాకుండా పంచాయతీలో నెలకొన్న రోడ్లు, నీరు, గృహాలు, అంగన్వాడి బిల్డింగ్, స్కూల్ భవనాలు, తదితర పలు సమస్యలపై గిరిజన విద్యార్థి సంఘం నాయకులు మణుగూరు బాబుజి, బూడిదే మాధవరావు చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని అందుకు చైర్మన్ శ్రావణ్ కుమార్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అనంతరం శ్రావణ్ కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే రేషన్ డిపో ఉండే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు మణుగూరు బాబుజి, బూడిదే మాధవరావు, వళ్ళంగి, సంజీవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధులకు దుమ్మా కొడుతున్న గోమంగి సెక్రటరీ

చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సమఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర - పెదబయలు: మండలంలో గోమంగి గ్రామ పంచాయతీ సెక్రటరీ మూడు నెలలుగా విధులకు దుమ్మా కొడుతున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ సమస్యలు, క్యాస్ట్ ఇన్‌కమ్ సర్టిఫికెట్ల విషయంపై పంచాయతీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఏ సమస్య చెప్పుకోవాలన్నా పంచాయతీ కార్యదర్శి కనీసం ఫోన్‌లో రెస్పాండ్ అయ్యే పరిస్థితి కూడా లేదన్నారు. కనుక మూడు నెలలుగా విధులకు దుమ్మా కొడుతున్న గోమంగి పంచాయతీ కార్యదర్శిపై తక్షణమే చర్యలు తీసుకొని మరో కొత్త కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేశారు.

కూలి రేట్లు పెంచాలని కార్మికులు వినతి

విశాలాంధ్ర - సీలేరు: రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితులలో కూలీల బ్రతుకులు దయనీయంగా తయారయ్యాయి. రోజంతా గొడ్డులా కష్టపడినా తినడానికి తప్పా పిల్లల్ని ఉన్నతమైన చదువులు చదివించుకోలేక పోతున్నామని మంచి ఆహారాన్ని పిల్లలకు పెట్టలేక పోతున్నామని ఆరోగ్యం బాగోలేకపోతే కనీసం వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉన్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారకొండలో బిల్డింగ్ పనులకు వెళ్లే కూలీలు సమావేశం అయ్యారు. మహిళలకు రూ.300 పురుషులకు రూ.400 తాపీ మేస్త్రీలకు రూ. 800 కాంట్రాక్టర్లు ఇస్తున్నారని ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి పోయాయని దీంతో కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉందని వారు వాపోయారు. మహిళలకు కనీసం రోజు కూలి రూ. 400 పురుషులకు రూ. 500 మేస్త్రిలకు రూ.1000 ఇవ్వాలని వారు డిమాండ్ చేసారు. అలా ఇస్తేనే పనికి వెళ్లాలని లేకుంటే ముకుమ్మడిగా పనులకు వెళ్ళ కూడదని వారు నిర్ణయించుకున్నారు. వారికి స్థానికులు మద్దతుగా నిలిచారు.

ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై హర్షం

విశాలాంధ్ర - సీలేరు: ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణయమని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిటికెల రాము అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆమోదం తెలపడం వలన త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు. ఈ కార్యక్రమంలో టి.నాగేంద్రబాబు, అదపా రాము, పిలోన్, యాదాల సాంబ, యాదాల ఎల్లాజీ, అచ్చియమ్మ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని టీడీపీ కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులు అందజేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు వంతాల కొండలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాలు కార్యకర్తలకు మంచి భరోసానిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.భాస్కర్‌రావు, వంజరి చిరంజీవి నాయుడు, ఎస్.కొండలరావు, బి.బాబురావు, ఆర్.కొండబాబు, క్రిష్ణమూర్తినాయుడు, టి.కొండలరావు, చిన్నరావు, కె.నితిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు విచ్చలవిడిగా వేస్తే చర్యలు

విశాలాంధ్ర - చింతపల్లి: విచ్చలవిడిగా వ్యర్థాలు పడేసి ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ప్రతి ఒక్కరూ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లను ఉపయోగించాలని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ పంచాయతీ ప్రజల సౌకర్యార్థం ఇప్పటికే గ్రామంలో డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ కొన్ని వీధులలో ప్రజలు వ్యర్థాలను బాధ్యతా రాహిత్యంగా బహిరంగంగా పడవేస్తున్నట్లు గుర్తించడం జరిగిం దన్నారు. ప్రధాన రహదారుల్లోనే గాక, పుర వీధులలోనూ, డస్ట్ బిన్‌లు ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 24, నుంచి 27 వరకు గ్రామంలో ఘనంగా జరుగనున్న గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారాలను వేయరాదని అన్నారు.

స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలుపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
రంపచోడవరం, గంగవరం, ఎటపాక, దుంబ్రిగుడ.
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్యరెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

నీటి తొట్టెల నిర్మాణం పరిశీలన

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని రాజుపేట పంచాయతీ రాజుపేట గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న నీటి తొట్టెల నిర్మాణాన్ని గురువారం జేఈ కె.నాగేశ్వరరావు పరిశీలించారు. నాణ్యమైన మెటీరియల్ వాడినట్లయితే ఎక్కువ కాలం మన్నిక ఉంటుందని, సకాలంలో నీటి తొట్టెల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ సుగ్గిరెడ్డి, రేవు సింహాచలం, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు

విశాలాంధ్ర - సీతంపేట: మండలంలో గుమ్మడ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. గర్భిణీలకు పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పి.రంగ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడ సర్పంచ్ బిడ్డిక ప్రధాన్, ఐసిడిఎస్ సిబ్బంది జిఎ ఉన్నిస్ బేగం, అంజలి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - చింతూరు: ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాలలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు 10 నెలల నుండి పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, చెల్లించలేని పక్షంలో ఉపాధి హామీ కూలీలని కూడా ఐక్యం చేసి ఆందోళన చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు సిసం సురేష్, పొడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మ, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు చింత రాంబాబు, సవలం కన్నయ్య, నాయకులు మడివి రాజేష్, సవలం దేశయ్య, నాగమణి, సత్తిబాబు. తదితరులు పాల్గొన్నారు.

చినమేరంగిలో ఎక్సైజ్ దాడులు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో గురువారం జిల్లా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 1800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేసి 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సిఐ వివి శేఖర్ బాబు, కురుపాం ఎస్ఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నవోదయం 2.0లో భాగంగా నాటు సారా తయారీ అమ్మకాలు నిషేధమని ఇతర ప్రాంతాలకు తరలించే వారిపైన గట్టి నిఘా వేశామని మే 31వ తేదీ నాటికి పూర్తిగా నియంత్రించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అంతేకాకుండా నాటు సారా సరుకులు సప్లై చేస్తున్న గెంబలి తిరుపతిరావు, సూరు శ్రీధర్లపై దర్యాప్తు చేసి వారిపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఇకనైనా నాటు సారా తయారీ అమ్మకాలు సప్లై చేసిన వారు మానుకోవాలని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రాజశేఖర్, చంద్రకాంత్‌లతోపాటు జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది, కురుపాం సిబ్బంది పాల్గొన్నారు.

సాకి గెడ్డ ఆక్రమణపై దర్యాప్తు చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి గ్రామం మీదుగా ప్రవహిస్తున్న సాకి గెడ్డ ఆక్రమణకు గురవుతుందని, అలాగే గెడ్డ నీటి ప్రవాహ మార్గాన్ని (దిశను) కొందరు భూస్వాములు స్వార్థం కోసం మార్చి గెడ్డను ఆక్రమిస్తున్నారని తక్షణమే దీనిపై సర్వే జరిపి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. గురువారం సాకి గెడ్డ ఆయకట్టు రైతులతో కలిసి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాకి గెడ్డ ప్రవాహం మూలంగా అనేక వందల ఎకరాలకు సాగునీరు అందుతుందని దీని మూలంగా తాళ్లబురిడి, లచ్చిరాజుపేట పుట్టూరు తదితర గ్రామాల్లో అనేక ఎకరాలకు సాగునీరు అందుతుందని అటువంటి గెడ్డను కొందరు స్వార్థ భూస్వాములు ఆక్రమించుకుని గెడ్డ పరివాహక దిశను మారుస్తున్నారని మండిపడ్డారు. దీని మూలంగా అనేక ఎకరాలకు నీరు అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం ఏ విధంగా గెడ్డ ప్రవహించేదో దానిపై సమగ్ర సర్వే జరిపి అదే మార్గంలో గెడ్డ నీరు ప్రవహించేలా చూడాలని అధికారులకు కోరారు. అలాగే ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకొని పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ వంటివి చేపట్టాలని సూచించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఆరోగ్యమే మహాభాగ్యమని, పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని స్థానిక తహసీల్దార్ సరస్వతి, మండల అభివృద్ధి అధికారి రామాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా కూనవరం ప్రాజెక్టు అధికారిణి పి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం తల్లులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ప్రథమ్ కోఆర్డినేటర్, అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, హెల్త్, వెలుగు, లయన్ డిపార్ట్మెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రహదారి కల్పించిన పెద్దిరాజు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి గ్రామంలోని క్రైస్తవ సమాజానికి చెందిన శ్మశానవాటికకు వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల నిర్వహించబడుతున్న నేషనల్ హైవే విస్తరణ పనుల కారణంగా పూర్తిగా దెబ్బతినడంతో సమాధులకు వెళ్లే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను ముందుగా గుర్తించిన బుంగ రాజ్ కుమార్ విషయాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి, మండల టీడీపీ సీనియర్ నాయకులు దంతులూరి శివ రామచంద్ర రాజుకి తెలియజేయడంతో వెంటనే స్పందించిన గొల్లపూడి పెద్దిరాజు తక్షణమే జేసిబితో సమాధులకు వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుంగ రాజ్ కుమార్ మాట్లాడుతూ తండ్రి బుంగ రాజారావు మాస్టారు, సోదరుడు బుంగ రాజబాబు జ్ఞాపకార్థంగా ఈ ప్రాంగణ అభివృద్ధికి తన వంతు ఆర్థిక సహాయం అందించినందుకు ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విషయాన్ని ఎమ్మెల్యే శిరీష భాస్కర్‌లకు తెలియజేసి నిధులు మంజూరైన వెంటనే ప్రహరీ నిర్మాణం, పాడుబడిన కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ, తాగునీటి సదుపాయం వంటి పనులు చేపడతామని తెలిపారు.

ఇంటి నిర్మాణ విలువ నోటీసులు పంపిణీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపునకు గురవుతున్న రాజుపేట పంచాయతీ రాజుపేట కాలనీ గ్రామంలో ఇంటి నిర్మాణ విలువ నోటీసులను సర్పంచ్ వి.శారద, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ రాము, జనసేన మండలాధ్యక్షుడు ములకాల సాయికృష్ణ చేతుల మీదుగా నిర్వాసిత ఇంటి యజమానులకు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రమాదేవి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితుల, బహుజనుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి

ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం: దళితుల, బహుజనుల అభ్యున్నతికి అహర్నిశలు కష్టపడతామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉన్నారని, ప్రతి దళిత కులానికి సామాజిక న్యాయం జరుగుతుందని, అందుకోసం ముఖ్యమంత్రి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ఎన్డీఏ కూటమి వచ్చిన తర్వాత దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. గతంలో 59 దళిత కులాల్లో ఎస్సీ మాలా, మాదిగ ప్రధాన కులాలకు తప్ప మిగతా ఏ దళిత ఉప కులానికి న్యాయం జరగలేదని, అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ జరిగిందన్న విషయం అందరికీ తెలిసిందేనని, ఇది ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఎస్సీల్లో ఉన్న అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గతంలో ఎస్సీ ఏ,బి, సి, డి అనే గ్రూపులో ఉండేవి అని, ఇప్పుడు ఏ, బి, సి గ్రూపులుగా విభజించడం జరిగిందని, అందులో ఏ-గ్రూపులో మా సోదరులు రెల్లి కులస్తులను చేర్చడం జరిగిందని, బి గ్రూపులో మాదిగ సోదరులు తోపాటు వారి ఉపకులాలను చేర్చడం జరిగిందని, సి- గ్రూపులో మా సోదరులు మాల, వారి ఉపకులాలను చేర్చడం జరిగిందని అన్నారు. ఇవన్నీ 2011వ సంవత్సరం జనాభా ప్రాతిపదికన విభజించడం జరిగిందన్నారు. రెల్లి కులస్తులకు ఎంతో ప్రాధాన్యత కల్పించాలని ఉద్దేశంతో ఈ అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. రెల్లి కులస్తులకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమన్నారు. రెల్లి కుల సంక్షేమ సంఘం మన్యం జిల్లా నాయకులు పాలకొండ రాజశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తీసుకురాడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఎస్సీ-ఏ క్యాటగిరిలో రెల్లి కులస్తులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. రెల్లి కులస్తుల్లో కేవలం మహిళల్లో ఒకరికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం కాకుండా పురుషులకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘం రాష్ట్ర నాయకురాలు జొన్నాడ శ్రీదేవి, దళిత కౌన్సిల్ సభ్యులు బొచ్చ ఆనందరావు, పొట్నూరు జయంతి, దివ్య, తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

చింతూరుకు వన్నెతెచ్చిన ఒకేషనల్ ఇంటర్ విద్యార్థి ప్రత్యూష

బిఎఫ్ఎస్సి గ్రూప్‌లో 964 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్
సన్మానించిన విద్యా శాఖ మంత్రి లోకేష్

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి జిల్లా చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన పింగళి అంజిరెడ్డి - కృష్ణవేణి దంపతుల బిడ్డ పింగళి ప్రత్యూష బిఎఫ్ఎస్సి గ్రూప్‌లో 964 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌లో నిలిచింది. పదవతరగతి చింతూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదివి పేదరికంతో కొన్నాళ్ళు తన చదువును ఆపి తిరిగి ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఇంటర్‌లో ఫిషరీస్ సైన్స్ గ్రూప్ లో ఉచిత ప్రవేశం పొంది ఆర్థిక స్తోమత సరిగా లేక బాలికల వసతి గృహంలో ఉండి చదువుతూ 964 మార్కులతో మన రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించింది. ఈ విషయం తెలిసిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పింగళి ప్రత్యూషను మంగళవారం అమరావతిలో శాలువతో సత్కరించి ల్యాప్‌టాప్‌ను బహుకరించారు. ప్రశంసలు అందుకున్న మన చట్టికి చెందిన పింగళి ప్రత్యూష ఒకేషనల్ సీనియర్ ఇంటర్లో ప్రత్యూషకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడంతో చింతూరు చట్టి షోషల్ మీడియా గ్రూప్‌లలో తనను అభినందించారు.

అధికారుల తీరు అసంతృప్తికరం

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ సంఘాల డిమాండ్

విశాలాంధ్ర - చింతపల్లి: మండల స్థాయి అధికారుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్వసభ్య సమావేశాలలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల సాక్షిగా లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడంలో మీన మేషాలు లెక్కించే అధికారులు మరో పక్క సమస్యలను సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసే పనిలో పడ్డారని వివిధ సంఘాలకు చెందిన నాయకులు అన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, దండకారణ్య సంస్థ ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ స్థానిక బాలికల ఆశ్రమ వసతి గృహ పాఠశాలకు వెళ్ళే రహదారిలో గిరిజన యువకుడు టి.రాంబాబు గుమ్మ శ్రేయ తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న చిన్న స్టిక్కరింగ్ బండిని మండల రెవెన్యూ అధికారులు ఈ నెల 14న ఏటువంటి ముందస్తు సమాచారంగానీ, నోటీసు లు గానీ ఇవ్వకుండా రాంబాబు, శ్రేయ దంపతుల జీవనోపాధి అయిన బడ్డిని కూల్చివేయడంపై ఆ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ వివిధ ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు మండల రెవెన్యూ అధికారుల తీరుపై గరం గరం అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లేకపోవడంతో, సమస్యపై డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. జీవనాధారాన్ని కోల్పోయిన కుటుంబానికి తక్షణమే నష్టపరిహారం అందించాలనీ, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ కార్యాలయం ఎదుట న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆయా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు లోచలి రామకృష్ణ, బౌడు గంగరాజు, దేపూరు శశికుమార్, గిడ్డి వరలక్ష్మి, కొర్రు మత్యలింగం, కూడా కొండలరావు, దుక్కెరి ప్రభాకర్, పెదబరడ మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ, సెగ్గే కామేశ్వరరావు, పొటుకూరి బెన్నస్వామి, కూడా ఇందిరా, సంపరి రమణ, ప్రసాద్, అచ్చిరాజులతో పాటు మాజీ ఎంపీపీ కవడం మచ్చమ్మ, కాసులమ్మ, కాగి వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో మహిళలను రైతులుగా గుర్తించాలి

ఉద్యాన అధికారి బాలకర్ణి

విశాలాంధ్ర - చింతపల్లి: ఏజెన్సీ వ్యాప్తంగా వ్యవసాయంలో భాగస్వామ్యం వహిస్తున్న మహిళలను రైతులుగా గుర్తించాల్సిన అవసరం ఉందని ఉద్యానశాఖ అధికారి బాలకర్ణ అన్నారు. వ్యవసాయంలో మహిళా సాధికారతపై ఉద్యానశాఖ, డిజిటల్ గ్రీన్, విజయవాహిని, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసెర్చ్ (ఐఐఎంఆర్) ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం మహిళా రైతులతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అదికారి బాలకర్ణ మాట్లాడుతూ ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజనులు చేపట్టే వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకమైందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరి భాగస్వామ్యంతో పనులన్నీ పూర్తి చేస్తారన్నారు. ఇంత కీలకంగా వ్యవహరించిన మహిళలను మార్కెటింగ్ సమయంలో అధిక శాతం మంది విస్మరిస్తారన్నారు. దీనికి భిన్నంగా సాగు ప్రారంభం నుంచి మార్కెటింగ్ చేసే వరకు మహిళలకు పూర్తిస్థాయిలో భాగస్వామ్యం కల్పిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. డిజిటల్ గ్రీన్ ప్రోగ్రాం మేనేజరు శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యవసాయంలో అందివస్తున్న సాంకేతికతపై గిరిజన మహిళలకు అవగాహన ఉండాలన్నారు. దీనివల్ల కుటుంబంలో ఇద్దరూ సమన్వయంతో మెరుగైన మార్కెటింగ్ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ గ్రీన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఫార్మర్ ఛాట్ యాప్ ను సదస్సులో పాల్గొన్న మహిళా రైతులంతా డౌన్లోడ్ చేసుకుని, దానిపై అవగాహన చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా మహిళలు ప్రధాన పాత్రగా నిర్వహించే వ్యాపారాలపై ఏ విధంగా ప్రణాళికలు చేయాలనే దానిపై సదస్సులో అవగాహన కల్పించు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో 60 మంది మహిళా రైతులతో పాటు డిజిటల్ గ్రీన్ ప్రతినిధి రేఖ, ఐఐఎంఆర్ ప్రతినిధి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ క్రికెట్ టోర్నీ విజేత కురుపాం కింగ్స్

విశాలాంధ్ర - కురుపాం: కురుపాంలో గత నెల రోజులుగా సాయిబాబా గుడి ఏదురుగా ఉన్న గ్రౌండ్‌లో కురుపాం ప్రీమియర్ లీగ్‌లో కురుపాం టీం విజేతగా నిలిచింది. ఆర్గనైజర్స్ దొనక నవీన్, పెద్దింటి ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో గత నెల రోజులుగా జరిగిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఉత్కంఠ భరితంగా సాగింది. ఫైనల్ మ్యాచ్‌లో కొండవాడ టీమ్‌పై కురుపాం కింగ్స్ విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కొండవాడ టీం 16 ఓవర్లకు 10 వికెట్లు నష్టానికి 110 పరుగులు సాధించింది. విరామం అనంతరం బ్యాటింగ్‌కి దిగిన కురుపాం కింగ్స్ టీం నాలుగు వికెట్లు మిగిలి ఉండగానే 111 రన్స్ చేసి కొండవాడ జట్టుపై విజయం సాధించింది. విన్నర్స్‌కు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ ప్రైజ్ మనీ 40వేల రూపాయలు, ట్రోఫీని అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన కొండవాడ జట్టుకు 20000 రూపాయల ప్రైజ్ మనీతోపాటు ట్రోఫీని అందజేసిన మాజీ జెడ్పిటిసి అందవరపు కోటేశ్వరరావు, థర్డ్ ప్రైస్ లిక్కిడి టీంకు వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు 10000 రూపాయలతో పాటు ట్రోఫీని అందజేసారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆదిల్, మాజీ ఎంపీపీ జి.రమణమూర్తి, వంశి, రమేష్ సుకేష్ చంద్ర పండా, త్రిపుర, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పదిమందికి గాయాలు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని చినబోగిలి కాసాపేట గ్రామాల మధ్యలో రాష్ట్రీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదిమందికి గాయాలయ్యాయి. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన మహిళలు అదే గ్రామానికి చెందిన ఆటోలో చినబోగిలి బ్యాంక్ పని నిమిత్తం విచ్చేసిన మహిళలు తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రయాణికులు వెళ్తున్న ఈఆటో ఎస్వీడీ దాబా దగ్గరకు వెళ్లేసరికి తన ముందు వెళ్తున్నట్టు ఒక ట్రాక్టర్ డ్రైవర్ తన ట్రాక్టర్‌ని నిర్లక్ష్యంగా ఎటువంటి సిగ్నల్స్ ఇవ్వకుండా సడన్‌గా రోడ్డు మధ్యలో బండి ఆపడంతో సదర ఆటో డ్రైవర్ తన ఆటోను కంట్రోల్ చేసుకోలేక ఆట్రాక్టర్ ని ఢీకొన్నట్టు తెలిపారు. దీంతో ఆటో తిరగబడిపోయి దాన్లో ఉన్న ప్రయాణికులు పదిమందికి గాయాలయ్యాయి వీళ్ళందరని బొబ్బిలి పీహెచ్సీకి చికిత్స నిమిత్తం తరలించడం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన పొట్నూరు పైడితల్లిఅనే ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ప్రమాదము జరిగిన కొద్దీ వ్యవధిలోనే ఆటోను ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించడంలో రకరకాలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏ వాహనం ఏ వాహనాన్ని ఢీకొన్నది ఎవరు స్పష్టంగా చెప్పలేకపోవడం గమనార్హం. ప్రమాదంలో పదిమందికి గాయాలు తగిలిన దానిపై దృష్టి సారించడం కంటే వాహనాలు తరలింపు పై పోలీసులు దృష్టిసారించడంపై అక్కడున్న స్థానికులు రకరకాలుగా కథలు చెప్పుకోవడం స్పష్టంగా కనిపించింది.

19న వికలాంగులకు సహాయ పరికరాల గుర్తింపు అంచనా శిబిరం

విశాలాంధ్ర - చింతపల్లి: వికలాంగులకు అవసరమైన వివిధ సహాయక పరికరాలు గుర్తింపు కోసం అంచనా శిబిరాన్ని ఈనెల 19న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండలాల పరిధిలోని వికలాంగులకు అవసరమైన వివిధ సహాయక పరికరాలు గుర్తింపు కోసం అంచనా శిబిరం ఈనెల 19న ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించ బడుతుందని, ఈ శిబిరంలో అర్హులైన వికలాంగులకు అవసరమైన సహాయక పరికరాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. చెవిటి వారికి చెవిటి మిషిన్లు, అవయవ లోపం ఉన్నవారికి కృత్రిమ అవయవాలు, వీల్ చైర్లు (80% పైబడి అంగవైకల్యం కలిగిన వారికి ఎలక్ట్రిక్ వీల్ చైర్లు) , మొదలగునవి అందజేయబడునన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యే వికలాంగులు తమతోపాటు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డులను రిజిస్ట్రేషన్ కొరకు విధిగా తీసుకు రావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ముడుపుల పూజలు

విశాలాంధ్ర - సీతానగరం: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో గురువారం జరిగిన ముడుపుల పూజలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలను భక్తి శ్రద్ధలతో చేశారు. ఆలయ ప్రధానఅర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, పీసపాటి రామానుజాచార్యులు టిటిడి పారాయణ కర్త కె.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈ పూజలను నిర్వహించారు. భక్తులు తెచ్చిన పూలతో స్వామివారిని అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. కొబ్బరికాయలు అరటిపల్లు, కుంకుమ, పసుపుతో స్వామివారి ప్రధానగుడి భక్తులతో కళకళలాడింది. ప్రతీ గురువారం శ్రీలక్ష్మి నరసింహ స్వామీ దేవాలయంలో జరుగుతున్న ఈ ముడుపుల పూజలకు పాతభక్తులతోపాటు కొత్త భక్తుల రాకతో ఆలయం కిటకిట లాడింది. నిర్మలమైన మనస్సుతో భక్తులు 27సార్లు ఆలయం చుట్టూ ముడుపులు పట్టుకొని ఓం శ్రీలక్ష్మి నరసింహస్వామి అంటూ ప్రదక్షిణలను చేస్తూ స్వామి వారికి పూజలు చేస్తున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించి తరలి వెళ్తున్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామితోపాటు శ్రీ వేణుగోపాలస్వామిని భక్తులు దర్శించుకుంటారు. గురువారం జరిగిన ముడుపుల పూజలకు ఆలయ ధర్మకర్త చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతి దంపతులు, జిల్లాలోని పలువురు అధికారులు, వ్యాపారవేత్తలు కూడా విచ్చేసి ముడుపుల పూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులతో పాటు పవన్ ఆచార్యులు, మురారి, మనోజ్ ఆచార్యులు, కృష్ణమోహన్ ఆచార్యులు, రఘురాం దగ్గరుండి పూజలు చేయించడంతోపాటు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసారు. ఇదిలా ఉండగా గత వారం రోజులుగా స్వామివారి వార్షికోత్సవ కార్యక్రమాలు కూడా ఘనంగా జరిగాయి.

దీర్ఘకాలిక రోగులకు అండగా 'ఆదివాసి ట్రస్ట్'

విశాలాంధ్ర - చింతపల్లి: అవగాహన లేమితో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులకు ఆదివాసి ట్రస్ట్ అండగా నిలుస్తుందని ఆ ట్రస్ట్ చైర్మన్ కేబీ పడాల్ అన్నారు. డుంబ్రిగూడ మండలం గుంట గన్నెల పంచాయతీ పింపోలు గూడ గ్రామానికి చెందిన లోకాయి మోతి అనే మహిళ గత కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ అంతర్ల గ్రామంలో ఉన్న ఆదివాసి ట్రస్ట్ ను ఆశ్రయించగా సమస్యను తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ కే బీ పడాల్ ట్రస్ట్ ద్వారా హెల్త్ కార్డు ఇచ్చి విశాఖలోని కార్పొరేట్ ఆసుత్రిలో మెరుగైన వైద్యానికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరి గ్రామాలలో నేటికీ ఎంతోమంది అమాయక గిరిజనులు ఉన్నారన్నారు. వారందరూ ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం, ఆర్థిక స్తోమత సహకరించక పోవడంతో గృహాల వద్దనే వ్యాధులతో బాధపడుతూ అనేకమంది మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. కొంతమంది దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్న సందర్భాలు లేకపోలేదు అన్నారు అటువంటి వారికి ఆదివాసి ట్రస్ట్ అండగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే ఎంతోమంది దీర్ఘకాలిక రోగులకు తమ ట్రస్ట్ తరఫున విశాఖలోని కార్పొరేట్ ఆసుపత్రు లలో మెరుగైన వైద్యాన్ని అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ చొప్పదండి నియోజకవర్గం కరీంనగర్ జిల్లా ఫౌండేషన్ సీఈఓ దుర్గ ప్రసాద్ ఆదేశాల మేరకు గామా ఫౌండేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కుటుంబాలకు ఆర్థిక భరోసాలో భాగంగా గురువారం మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామం అయిన సున్నం మట్కా గ్రామంలో ఆర్థిక భరోసా నిత్యావసర వస్తువుల కిట్లు చిన్న మట్టపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్ పిట్టా రామారావు చేతులు మీదుగా పంపిణీ చేశారు. గామా ఏంసీఓ శీలం ముత్తయ్య ఆధ్వర్యంలో సుమారు 20 కుటుంబాలకు ఈ వితరణ అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిట్ట రామారావు మాట్లాడుతూ గామా ఫౌండేషన్ వారు ఆరోగ్య ఆర్థిక అవసరాల కోసం మంచి విలువలతో కూడిన ఆర్గానిక్ నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గామా ఫౌండేషన్ సభ్యులు మడకం రాజు, ముచ్చిక మహేష్, సున్నం మట్కా గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.